ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 8 మార్చి 2025 | 5





మహిళ ఆకృతిలో కొవ్వొత్తులను వెలిగించిన మామిడికుదురు మండలం ఈదరాడ హైస్కూలు విద్యార్థులు



కలెక్టరేట్ వద్ద మహిళా దినోత్సవ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ

స్త్రీ సమానత్వమే మానవ ప్రగతికి మూలం : జేసీ నిషాంతి

అమలాపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మానవ ప్రగతికి మూలమని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ వద్ద నుంచి నల్లవంతెన వరకు చేపట్టిన ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌చార్జి డీఎస్పీ రఘువీర్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి : ఎస్పీ కృష్ణారావు




ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

ఆత్రేయపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఎంతో ధైర్య సాహసాలతో ఉద్యోగం నిర్వహిస్తున్న మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం సచివాలయ పోలీసులు, మహిళా పోలీసులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఎస్పీ కట్ చేశారు. మహిళా పోలీసులకు చీరలు, స్వీట్లను అందజేశారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము పాల్గొన్నారు.

కల్తీ..పాలు!

పెరుగు తిన్నా... పాలు తాగినా.. అనారోగ్యం పాలే..



చిక్కదనం కోసం పాలలో కలిపేస్తున్నారిలా..



బెంజాయిక్ యాసిడ్ డబ్బా

తాగే పాలు కల్తీ.. వాడే బెల్లం కల్తీ.. తినే నెయ్యి కల్తీ.. చివరకు కూరలో వేసుకునే కారం.. పసుపూ కల్తీనే.. ఇలా ఒక్కటేంటి..ఎందెందు వెతికినా అందందే కల్తీ.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనేక నకిలీ ఆహార పదార్థాల తయారీకి అడ్డాగా మారుతోంది.. గతంలో అనపర్తిలో నకిలీ టీపొడి వ్యవహారం సంచలనం సృష్టించగా.. ఆ తర్వాత తునిలో పశువుల ఎముకలతో తయారు చేసే కల్తీ నూనె బయటపడింది.. ఇప్పుడేమో కాకినాడలో జనం నిత్యం తాగి, తినే పాలు, పెరుగులోను భారీగా కల్తీ వెలుగులోకి వచ్చింది. ఓ వ్యాపారి ఏకంగా రసాయనాలను కలిపిస్తూ పట్టుబడ్డ వైనం అందరినీ నివ్వెరపోయేలా చేస్తోంది. అసలు బయట ఏం కొనాలో..ఏం తినాలో తెలియని పరిస్థితి దాపురించింది. ఆహార కల్తీ దందా తల్చు కుంటేనే ఒళ్లు జలదరిస్తోంది. - కాకినాడ/ఆంధ్రజ్యోతి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కల్తీ ఆహారం కలకలం రేపుతోంది. తినే ప్రతి పదార్థంలోనూ ఏదో ఒక మూల కల్తీ జాడ కనిపిస్తోంది. రోజూ ఏదోక చోట ఈ కల్తీ ఆహారపదార్థాల గుట్టు వెలుగులోకి వస్తోంది. శుక్రవారం కాకినాడ ప్రతాప్ నగర్ వినాయకుడి గుడి సమీపంలోని శ్రీ సాయి శ్రీనివాసా మిల్క్ పార్లర్‌లో కల్తీ పాల వ్యవహారం బయటపడడం సర్వత్రా కలకలం రేపుతోంది. నిత్యం జనం పాలు,పెరుగు బయటే కొనుగోలు చేస్తారు. కొందరు వ్యాపారులు స్వచ్ఛమైన ఆవుపాలు, గేదెపాలు అంటూ కల్తీ పాలను అంటగుతున్నారు. రోజుల తరబడి నిల్వ ఉండిపోయిన పాలకు వ్యాపారులు రకరకాల రసాయనాలు కలిపి జనానికి అంట గడుతున్నారు. వాస్తవానికి బెంజాయిక్ యాసిడ్‌ను పెర్‌ఫ్యూమ్‌లు, ఇతర సౌందర్య సాధనాలు, పండ్లు, జామ్‌లు, జెల్లీలు, ఐస్‌క్రీంలు ఎక్కువ రోజులు వాసనతోపాటు నిల్వ ఉండేందుకు వినియోగిస్తారు. అలాంటిది పాలు, పెరుగులో వినియోగించడంతో ఏస్థాయిలో కల్తీకి పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం తదితర పట్టణాలు, నగరాలతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ స్వచ్ఛమైన పాల పేరుతో ఈ యాసిడ్‌లను యథేచ్ఛగా వినియోగించేస్తున్నారు. జనం కల్తీని పసిగట్టలేక కొనుగోలు చేస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడంతో పాల దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. తాజా పాలు పేరుతో ఎక్కడికక్కడ ఈ వ్యాపారం ఉమ్మడి జిల్లాలో లక్షల్లో టర్నోవర్ జరుగుతోంది.

అడ్డూ..అదుపూ లేదంతే..

ఉమ్మడి జిల్లాలో కల్తీ ఆహారం విపరీతంగా పెరిగిపోతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కాకినాడ జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారులు 195 శాంపిల్స్ సేకరించారు. తూర్పుగోదావరి జిల్లాలో గడచిన ఏడాదిలో 139, కోనసీమ జిల్లాలో 110 శాంపిళ్లు సేకరించారు. ఇలా శాంపిళ్లు తీశారంటేనే ఆహార కల్తీ అనుమానం అన్నమాట. ఇలా ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాల ఈ కల్తీ రకరకాల రూపంలో జనం ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లలోను ఇటీవల కల్తీ మరింత పెరిగిపోయింది. ఇటీవల కాకినాడలో సుబ్బయ్య హోటళ్లలోను ఈ తరహా ఘోరాలు బయటపడ్డాయి. మరో పక్క ఉమ్మడి జిల్లాలో ఫాస్ట్‌ఫుడ్ బిజినెస్ పెరిగింది. స్ప్రే డ్రైయింగ్ పౌడర్, టేస్టింగ్ సాల్ట్ విచ్చలవిడిగా వినియో గిస్తున్నారు. రకరకాల రసాయనాలను కలుపుతూ ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఆహార నియంత్రణ డివిజన్ అధికారి సుబ్బారావు ఈ దాడుల గురించి ప్రస్తావిస్తూ జనం ఆరోగ్యంతో కొందరు వ్యాపారులు ఆడుకుంటున్నారన్నారు.

- పెరిగిపోతున్న ఆహారకల్తీ
- గతేడాది 444 కేసులు నమోదు
- కాకినాడలో కల్తీ పాలు,పెరుగు
- తాజాగా ఉండేలా రసాయనాలు
- బెంజాయిక్ యాసిడ్, స్ప్రే డ్రైయింగ్ పౌడర్ మిక్సింగ్
- ఉమ్మడి జిల్లాలో పాల దుకాణాలు
- జనం అనారోగ్యం పాలు

బెంజాయిక్ యాసిడ్ వాడితే..

బెంజాయిక్ యాసిడ్ వాడకూడని వస్తువుల్లో వాడడం నేరం కింద లెక్కే. కానీ అడ్డగోలుగా జరిగిపోతున్నాయి. వాస్తవానికి పాలు, పెరుగులో ఇవి వాడడం వల్ల చర్మం, కళ్ల దురద, దగ్గు, నీరసం, శ్వాససంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ప్రధానంగా వయసు మీద పడినవారిపై మరింత ప్రభావం చూపుతాయి.

తినే.. ప్రతీది కలుషితమే..



తినే ప్రతి పదార్థం కలుషితమవుతోంది. చివరికి స్వచ్ఛమైన పాలను వదలడంలేదు. పాలు ఎక్కడ కొంటున్నాం.. అంత తాజాగా ఎలా ఉంటున్నాయి వంటి విషయాలను గమనించాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తేడాలు గమనిస్తే వెంటనే ఆహార నియంత్రణ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఆహార పదార్థాలు నాసిరకం అని తేలితే జేసీ కోర్టులో జరిమానాలు విధిస్తారు. ఈ కేసుల్లో రూ.10 వేల నుంచి రూ.మూడు లక్షల వరకు జరిమానాలు విధించే అవకాశం ఉంది. **- శ్రీనివాసరావు, ఆహార నియంత్రణ జిల్లా అధికారి, కాకినాడ**

గతంలో కల్తీ కేసులు ఇలా..

- మూడేళ్ల కిందట అనపర్తి మండలం దుప్పలపూడిలోని భారీ నకిలీ టీ పొడి రాకెట్ బట్టబయలైంది. ఎర్రమట్టి, వాషింగ్ పౌడర్, జీడి పిక్కల తొక్కలు వినియోగించి వీటిని తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు.
- మూడున్నరేళ్ల కిందట తునిలో పశు కళేబరాలు, ఎముకల నుంచి నకిలీ నూనె తయారు చేస్తున్న ముఠా పట్టుకున్నారు.
- గొల్లప్రోలులో గతేడాది ఒక షాపులో కారం పరిశీలించి సురక్షితం కాదని తేల్చి విక్రయదారులుపై కేసు నమోదు చేశారు.
- పెద్దాపురంలో ఓ కంపెనీ గోలీసోడాలు నాసిరకంగా ఉండడంతో జరిమానా వేశారు.
- ఏలేశ్వరం, తాళ్లరేవులలో బెల్లం తయారీలో సల్ఫర్ కలపడంపై కేసులు పెట్టి జేసీ కోర్టులో జరిమానాలు విధించారు.
- అన్నవరంలో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నాణ్యతగా లేకపోవడం, ఓ హోటల్‌లో చికెన్ వింగ్స్ తయారీలో ఫుడ్ కలర్ వినియోగం గుర్తించారు. తుని, తేటగుంటలలో కూడా రంగులు కలిపిన చికెన్ విక్రయించడంపై కేసులు నమోదు చేశారు.
- రౌతులపూడి మండలం, తాళ్లరేవు మండలంలో తాగునీటి కలుషితంపై వచ్చిన ఫిర్యాదులపై తనిఖీలు చేసి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు జరిమానాలు విధించారు.
- కాకినాడ రూరల్ మండలం చీడిగలోని ద్వారకా అపార్ట్‌మెంట్స్‌లో కల్తీ పాలు విక్రయించిన విక్రయదారుడికి రూ.10 వేలు జరిమానా వేశారు. కాకినాడ ప్రతాప్‌నగర్, గాంధీనగర్ వెంకటేశ్వరస్వామి గుడి ఎదు రుగా ఉన్న అన్నపూర్ణ మిల్క్స్‌పై దాడిచేసి పాలు, పెరుగులో రసాయనాలు కలుపుతున్నట్టు గుర్తించి జరిమానాలు వేశారు.
- కాకినాడలో సత్తిబాబు కోడిపలావ్‌లో ఆయిల్ కలిపిన నెయ్యి వినియోగం, రంగు కలిపిన చికెన్ పకోడి విక్రయించడంతో రూ.పది వేల జరిమానా విధించారు.



కాకినాడలో కల్తీ పాలను పట్టేశారు!

కాకినాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కల్తీ పాలను తయారు చేస్తున్న ఓ మిల్క్ పార్లర్‌పై ఆహార నియంత్రణ అధికారులు శుక్రవారం దాడి చేశారు. కాకినాడ ప్రతాప్ నగర్ వినాయకుడి గుడి సమీపంలో ఉన్న శ్రీసాయి శ్రీనివాసా మిల్క్ పార్లర్‌లో కల్తీ పాలు విక్రయిస్తున్నారని ఆహార నియంత్రణ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కాకినాడ డివిజన్ అధికారి సుబ్బారావు తనిఖీ చేశారు. అక్కడ పాలు, పెరుగు తాజాగా ఉండేందుకు రసాయనాలు కలుపుతున్నట్టుగా అనుమానిస్తూ శాంపిల్స్ సేకరించారు. పాలు తాజాగా, చిక్కగా ఉండేందుకు కలిపే బెంజాయిక్ యాసిడ్ డబ్బా సీజ్ చేశారు. మట్టి ముంతల్లో ఉంచిన పెరుగులో స్కిమ్డ్ మిల్క్ ఫౌడర్ కలిపి విక్రయిస్తున్నట్టుగా తెలిసి.. వాటిని సీజ్ చేశారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపుతున్నట్టు ఆహార నియంత్రణ జిల్లా అధికారి శ్రీనివాస్ తెలిపారు.

పేదరిక నిర్మూలన లక్ష్యంగా..



- నేటి నుంచి జిల్లాలో పి-4 పాలసీ సర్వే
- సచివాలయ ఉద్యోగులకు దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ
- మార్చి 18వ తేదీలోపు సర్వే పూర్తి కావాలని ఆదేశాలు

పి.గన్నవరం, మార్చి7(ఆంధ్రజ్యోతి): అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు సీఎం చంద్రబాబునాయుడు పది సూత్రాల కార్యక్రమం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పది సూత్రాల్లో ముఖ్యమైనది పేదరిక నిర్మూలన లక్ష్యంతో పి-4 పాలసీ. ఈ కార్యక్రమం కింద ఒక సర్వేను శనివారం నుంచి నిర్వహించనున్నారు. పి-4 సర్వే (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్‌షిప్) ద్వారా ప్రతి కుటుంబంలో పేదరికాన్ని అధిగమించి ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం దీని ముఖ్యోద్దేశం. ఈ విధానంలో ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్న పది శాతం వారి సహకారం ద్వారా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న 20 శాతం పేదలకు ఆర్థిక సాధికారిత, వారి జీవనప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యం. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించేందుకు ఇప్పుడు సర్వే జరుగుతుంది. జిల్లాలో ఉన్న సుమారు ఆరు లక్షల కుటుంబాల్లో ఎంపిక చేసిన కొన్ని కుటుంబాలను జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సర్వే చేస్తారు. సంబంధిత సిబ్బంది గ్రామసభ ద్వారా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తిస్తారు. ఈ సర్వే అదనపు సంక్షేమ పథకం మాత్రమే. ఈ సర్వే ఇతర సంక్షేమపథకాలపై ప్రభావం ఉండదు. అంటే ప్రతి ఒక్క కుటుంబానికి ఇప్పుడు ఇస్తున్న ఏ పథకం ద్వారా రద్దు చేయరు. జీఎస్‌డబ్ల్యూ ఎస్ ఉద్యోగులు (సచివాలయం ఉద్యోగులు) తమకు కేటాయించిన అధికార పరిధి, క్లస్టర్ల ఏరియాలో పి-4 సర్వేకోసం సర్వేయర్లుగా పనిచేయనున్నారు. ఈ సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. అయితే సంబంధిత సిబ్బంది ఈ సర్వేను కుటుంబ యజమాని అనుమతితో మాత్రమే చేయనున్నారు. సర్వేలో మొబైల్ యాప్ ద్వారా ప్రతి కుటుంబం నుంచి 27 ప్రశ్నలకు సంబంధించి వివరాలు సేకరిస్తారు. ఈ సర్వే శనివారం ప్రారంభించి మార్చి 18వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంది. ఈ సర్వే పరిధిలోకి వచ్చే కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ లేనివారు, తాగునీరు అందు బాటులో లేనివారు, బ్యాంకు వ్యక్తిగత ఖాతా లేనివారు, కుటుంబంలోని వ్యక్తులకు ఎటువంటి సంపాదన, ఆదాయ వనరులు లేనివారు, గ్యాస్ కనెక్షన్ లేనివారు, పక్కా ఇల్లు లేనివారు అర్హులు. అదేవిధంగా మౌలిక సదుపాయాలైన టెలివిజన్, ఫ్రిడ్జ్, ఏసీ, ల్యాప్‌టాప్ వంటి గృహోపకరణాలు లేనివారు మాత్రమే అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

విదేశాలకు వెళ్లేవారి సౌకర్యార్థం వారం రోజుల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు : కలెక్టర్

అమలాపురం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు చదువుకోసం విదేశాలకు వెళ్లేవారి సౌకర్యార్థం వారం రోజుల్లో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో విదేశీ వ్యవహారాల హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేయనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కోఆర్డినేషన్ సెక్షన్, పోస్టల్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించి హెల్ప్‌డెస్క్ విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. విదేశాలకు వెళ్లదలచిన వారికి సహాయం అందించే ముఖ్య మార్గదర్శిగా హెల్ప్‌డెస్క్ పనిచస్తుందన్నారు. ఏజంట్ల ద్వారా విదేశాలకు వెళ్లి ఏ ఒక్కరూ మోసపోకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుందన్నారు. విదేశాలకు వెళ్లేవారు నేరుగా హెల్ప్‌డెస్‌ను ఆశ్రయిస్తే 18 దేశాల్లో విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు మార్గనిర్దేశం చేస్తూ ప్రభుత్వపరంగా పాస్‌పోర్టు, వీసా అనుమతులకు సహకరిస్తుందన్నారు. ఆయా దేశాల్లో ఆహారపు అలవాట్లు, ఆచార వ్యవహారాలు, భౌగోళిక పరిస్థితులు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, వీటిన్నింటిపై ఒక్కో దేశానికి సంబంధించి ఒక్కో కరపత్రాన్ని ముద్రించి అందించడం జరుగుతుందన్నారు. హెల్ప్‌డెస్క్ అన్ని అంశాలను పరిశీలించి పోస్టల్ డిపార్టుమెంట్‌కు పాస్‌పోర్టు కోసం సిఫార్సు చేస్తుందన్నారు. కోనసీమ జిల్లా ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల వదంతులను నమ్మవద్దని స్పష్టంచేశారు. వాటిని నివృత్తి చేసుకునేందుకు 08856- 236388 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేయాలన్నారు. హెల్ప్‌డెస్క్‌కు నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి సమన్వయకర్తగా, వికాస జిల్లా మేనేజర్ హెల్ప్‌డెస్క్ సిబ్బందిగా కానిస్టేబుళ్లు సత్తిబాబు, నాగేంద్ర, సచివాలయ మహిళా కానిస్టేబుళ్లు సఫియా, జి.నాగసుశీలను నియమించామన్నారు. వీరు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్, పోస్టల్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రారంభం

అమలాపురంటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకన శుక్రవారం ప్రారంభమైనట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు ఆఫీసర్ వనుము సోమశేఖరరావు తెలిపారు. మూల్యాంకనం ప్రారంభించే ముందు అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. తొలిరోజు సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకన ప్రారంభించారు. ఇంటర్ ప్రథమ ఏడాదికి సంబంధించి 5,540, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 4929 సంస్కృతం జవాబు పత్రాలను దిద్దాల్సి ఉంటుందన్నారు. సంస్కృత ఉపన్యాసకులు అత్యంత శ్రద్ధగా మూల్యాంకనం చేయాలని సూచించారు. ఈనెల 17 నుంచి ఇంగ్లీషు, తెలుగు, హిందీ, గణితం, పౌరశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకన ప్రారంభిస్తారు. 22 నుంచి భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం, 24 నుంచి రసాయన శాస్త్రం, చరిత్ర, 26వ తేదీ నుంచి వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, వాణిజ్యశాస్త్రం జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్‌కు సంబంధించి శుక్రవారం జరిగిన వివిధ పరీక్షల్లో 543 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సోమశేఖరరావు తెలిపారు.

నేడు అమలాపురంలో ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన

అమలాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కె.అచ్చెన్ననాయుడు శనివారం కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో పర్యటించనున్నారు. ఉదయం 7.30కు విజయవాడ నుంచి కారులో బయలుదేరి 10.30కు రోడ్డు మార్గాన అమలాపురం చేరుకుంటారు. స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మంత్రి అచ్చెన్ననాయుడు పా ల్గొంటారు. మధ్యాహ్నం 1.30 తరువాత గంట సేపు విరామం తీసుకుని తిరిగి రోడ్డు మార్గన శనివారం సాయంత్రానికి విజయవాడ చేరుకుంటారు. ఈ విషయాన్ని జిల్లా పౌరసంబంధాల శాఖాధికారి లక్ష్మీనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళా 'మణులు'

మహిళా దినోత్సవ కథనాలు -6లో

రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (శని)	సా.6.20
	సహరి (ఆది)	ఉ.4.54

కొనసాగుతున్న భూ ఆధార్

- ప్రతి రైతుకు 14 అంకెల యూనిక్ ఐడీ ఉండాల్సిందే
- జిల్లావ్యాప్తంగా 2,15,000 మంది రైతులు
- ఇప్పటి వరకు 1.27 లక్షల మంది రైతులకు ఆధార్ నమోదు
- వారంలోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు

పి.గన్నవరం, మార్చి7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగాన్ని పూర్తిస్థాయిలో ఆధునిక సాంకేతిక రంగాల వైపు తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పద్ధతులను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. రైతులకు అందించే ప్రతి సంక్షేమ ఫలానికి రక్షణ నిమిత్తం మనిషికి ఇచ్చే ఆధార్ మాదిరిగానే భూములకు కూడా భూ ఆధార్(యూనిక్ ఐడీ) 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను అందించనుంది. స్వంత భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే రాయితీలను పొందాలంటే సంబంధిత రైతుకు 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదులో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవల్సిందే. ప్రస్తుతం సొంత రైతులు మాత్రమే తమ భూములకు భూఆధార్ నమోదు చేయించుకోనేందుకు రూపకల్పన చేశారు. దీంతో జిరాయితీ భూములు కలిగిన రైతులకు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసి యూనిక్ ఐడీని అందిస్తున్నారు. మిగిలిన డి-పట్టా భూములు, దేవదాయశాఖకు సంబంధించిన భూములు, ప్రభుత్వం గిఫ్ట్ రూపంలో ఇచ్చిన భూములకు ఫార్మర్ రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. అయితే భవిష్యత్తులో ఆ తరహా భూములతోపాటు కౌలు రైతుల నిమిత్తం నూతన మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఉగాదికి అందించే అన్నదాత సుఖీభవ పథకానికి యూనిక్ ఐడీని వినియోగించే అవకాశం ఉండడంతో అర్హులైన రైతులు ముందే మేల్కోవాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 2,15,000 మంది రైతులు ఉండగా వారిలో పీఎం కిసాన్ పొందుతున్న రైతులు 1,19,326 ఉన్నారు. ఇప్పటివరకు 1,27,992 మంది రైతులు మాత్రమే 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదులో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవడంతో 57.89 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల పి.గన్నవరంలో పర్యటించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారి బోసుబాబు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై పలు సూచనలు చేశారు.




ఉడిమూడిలో భూఆధార్‌ను నమోదు చేసుకుంటున్న మహిళ రైతులు

వారంలోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వారంలో పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశాం. రాబోయే రోజుల్లో యూనిక్ ఐడీ ఉన్న రైతుకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమఫలాలు అందుతాయి. ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ తరహా సంక్షేమ పథకాలకు భూఆధార్ (యూనిక్ ఐడీ) తప్పనిసరిగా ఉండాల్సిందే. సంబంధిత రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భూములకు యూనిక్ ఐడీని తీసుకోవాలి.

- బోసుబాబు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



మహిళా 'మణులు'

- వివిధ రంగాల్లో మహిళల రాణింపు
- ఇటు కుటుంబ బాధ్యతలు.. అటు అనేక పనుల్లో విజయాలు
- స్ఫూర్తిప్రదాతలుగా నేటితరం మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

స్త్రీ అంటేనే శక్తి స్వరూపంగా భావిస్తాం. కానీ అనాది నుంచి మహిళలు వంటింటికే పరిమితమైపోయారు. కానీ దశాబ్దాల కిందటే ఆకాశంలో సగం.. అవకాశంలో సగం అంటూ ఒక్కొక్క రంగంలో ప్రవేశించి తమ సత్తా చాటారు. ఆ తర్వాత అన్నింటా మేమే అన్నట్టు మహిళలు దూసుకెళుతున్నారు. ఇప్పుడు ఈ పని కేవలం పురుషులు మాత్రమే చేయగలరన్న రంగం లేదు. అన్నింటా వారు కాలుమోపడం కాదు, ప్రతి రంగంలోనూ తమదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. వీరి విజయాల వెనుక అలుపెరగని శ్రమ ఉంది. అనితర సాధ్యమైన స్థైర్యం ఉంది. ఇటు కుటుంబాన్ని, అటు తాము చేపట్టిన పనిని సమర్థవంతంగా నిర్వహిస్తూ విజయదుందుభి మోగిస్తున్నారు. చిన్నదో, పెద్దగా ఏదొక ఉపాధి.. లేదా ఉద్యోగం.. ఇలా విభిన్నమైన రంగాల్లో తమ కృషిని సాగిస్తున్న మహిళల పరిచయాలు ఇవి. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయా మహిళల విజయ గాథలను.. మీరూ చదివేయండి..!







తయారు చేసిన తినుబండారాలతో సత్య. ఉండలు, అచ్చుల తయారీలో బిజీగా ఉన్న మహిళలు, సత్య

థర్టీ ఇయర్స్.. 'ఉండ'స్త్రీ..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కొందరు వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్ని మధ్యలోనే వదిలేస్తారు. కాలానుగుణంగా నిర్వహించలేకనో.. ఇతరత్రా కారణాలతో స్వస్తి పలుకుతారు.. మరికొందరు మాత్రం ఇలాంటి వ్యాపారాలను కొనసాగిస్తుంటారు. తమ కుటుంబ పోషణ కోసం తీవ్రంగా శ్రమిస్తుంటారు. ఇదే కోవకు చెందిన వారు ఆమె.. తమ అత్తమామలు, వారి పూర్వీకులు చేసిన తినుబండారాల తయారీ వ్యాపారాన్ని గత 30 ఏళ్లగా నిర్వహిస్తూ.. తనతో పాటు మరో 20 మందికి ఉపాధి చూపుతున్నారు. అందరి నోళ్లను తీపి చేస్తూ.. ఒక 'ఉండ'స్త్రీనే.. నడుపుతున్నారు. సాలిగ్రామ సత్య, శ్రీనివాస్ దంపతులు కాకినాడ నగరంలోని రాజాజీవీధి, నెల్లి అప్పన సెంటర్లో నివసిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల కిందట సత్య ఓ సాధారణ గృహిణి, ఆమె భర్త శ్రీనివాస్ పోలియో బారిన పడడంతో ఒక చేయి పనిచేయదు.. వీరి కుటుంబీకులు గతంలో రకరకాల తినుబండారాలు తయారు చేసేవారు.. వారికి సత్య, ఆమె భర్త సహకరించేవారు.. తర్వాత కాలంలో తన భర్త, ఇద్దరి పిల్లల పోషణ భారాన్ని ఆమె తీసుకుంది. మరోవైపు శ్రీసాయి బాలాజీ గ్రూపులో సభ్యురాలిగా చేరింది. మహిళా స్వయం సహాయక రుణాలను తీసుకుని తినుబండారాల వ్యాపారాన్ని సుమారు 30 ఏళ్లగా సక్సెస్ ఫుల్‌గా నడిపిస్తోంది. వేరుశెనగ ఉండలు, నువ్వుల ఉండలు, మరమరాల ఉండలు, పేలాల ఉండలు, నువ్వుల అచ్చులు, కరకజ్జపు ఉండలు, గుల్ల శనగపప్పు ఉండలు, కొబ్బరి ఉండలు.. ఇలా సుమారు పది రకాల తినుబండారాలను నిత్యం తయారుచేస్తున్నారు. వీటి తయారీ కోసం సుమారు 15 మంది మహిళలు ఉదయం పది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పనిచేస్తున్నారు. వారి పనితీరు ఆధారంగా వారికి డెయిలీ పేమెంట్ అందజేస్తున్నారు. అంతేకాదు వీరు తయారీ చేస్తున్న ఈ తినుబండారాలను శుభ్రంగా ప్యాక్ చేసి.. విక్రయిస్తున్నారు. కాకినాడ నగరం, గ్రామీణ ప్రాంతాలతోపాటు యానాం, రామచంద్రపురం, ద్రాక్షారామం, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, గొల్లప్రోలు వంటి ప్రాంతాల నుంచి అనేక మంది చిరువ్యాపారులొచ్చి కొనుగోలు చేస్తున్నారు.

స్వశక్తితో ఎదగాలని.. : సత్య

"మా పెళ్లయిన కొత్తలో నేను, నా భర్త మా అత్తమామల వ్యాపారంపైనే ఆధారపడి జీవించేవాళ్లం.. తర్వాత వారి తదనంతరం.. ఆ వృత్తే జీవనాధారమైంది. అంతంతమాత్రంగా ఆర్థిక పరిస్థితులున్న తమకు మహిళా స్వయం సహాయక రుణాలు చేయూతగా నిలిచాయి. ఆ రుణాల ద్వారానే వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. నేనే కాదు.. నా వద్ద సుమారు 15 మంది నిత్యం మహిళలు పనిచేస్తున్నారు. వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. మాకు నగరపాలక సంస్థ మెప్మా అధికారులు కూడా బాగా సహకరిస్తున్నారు. ఇటీవలే మమ్మల్ని హైదరాబాద్ తీసుకువెళ్లారు. అక్కడ మూడు రోజులపాటు వ్యాపారాన్ని ఎలా మార్కెట్ చేసుకోవాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసేందుకు కూడా ప్రయత్నిస్తున్నాం"

సమాజ సేవకులు

- సామాజిక సేవలో వైశ్య మహిళలు
- వాసవీ మహిళా వెల్ఫేర్ అసోసియేషన్
- 11 ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



వ్యవస్థాపకురాలు శ్రీదేవి

మండపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవసేవ. సేవ చేసేందుకు చదువుతో పని లేదు. ధనంతో పని లేదు. కేవలం సంకల్పబలం, చేయాలనే పట్టుదల ఉంటే చాలు ఏదైనా చేయవచ్చు అంటున్నారు మండపేట పట్టణానికి చెందిన వైశ్య మహిళలు. వాసవీ మహిళా వెల్ఫేర్ అసోషియేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు వారణాసి శ్రీదేవి 11 సంవత్సరాల నుంచి స్వచ్ఛందంగా 30మంది మహిళలతో కలిసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతియేటా మహిళా దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహణ, వృద్ధులు, అనాథలకు శీతాకాలంలో దుప్పట్ల పంపిణీ, వేసవిలో చలివేంద్రాల నిర్వహణ, మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

ఆలోచన ఎలా వచ్చింది..

మండపేటకు చెందిన వారణాసి శ్రీదేవి, 9వ తరగతి వరకు చదువుకున్నారు. 2009లో ఆమె స్నేహితురాలు ఆసుపత్రిలో ప్రసవ సమయంలో రక్తం కోసం ఇబ్బంది పడుతోంది. ఆ సమయంలో రక్తం లభ్యం కావటం ఇబ్బందికరంగా మారింది. రక్తం లభ్యం అయినప్పటికీ చివరికి తల్లీబిడ్డ దక్కలేదు. వారిమరణంతో తీవ్రంగా కలత చెందిన శ్రీదేవి మహిళ మరణానికి ప్రధాన కారణం రక్తం లభ్యం కాకపోవడమేనని చలించి ఆమె తొలిసారిగా మహిళలు కూడా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్న ఆలోచన రావడం ఆనాటి నుంచి ప్రతి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించి 100 మంది రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా మారారు. యేటా నిర్వహించే రక్తదాన శిబిరంలో 100 ప్యాకెట్లు సేకరించి కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంకుకు రక్తం ఇస్తున్నామని ఆమె చెప్పారు. అలాగే తమ ట్రస్టు ద్వారా శీతాకాలంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, వేసవిలో చలివేంద్రాలు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. తమ ట్రస్టుకు అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం సహకారం అందిస్తున్నారన్నారు. తమ సొంత నిధులు, దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తుంటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీదేవి చెప్పారు.

సూర్యకిరణాలు

- ఆదర్శంగా సూర్య గ్రూపు సభ్యులు
- ఏలేశ్వరంలో స్వయం ఉపాధిలో రాణిస్తున్న మహిళలు



రొట్టెలు తయారు చేస్తున్న పొదుపు సంఘం మహిళలు

ఏలేశ్వరం, మార్చి 7(ఆంధ్ర జ్యోతి): గతంలో బ్యాంకులు మంజూరు చేసిన సొమ్మును సమానంగా పంచుకోవడం ఆనవాయితీగా ఉండేది. కానీ ప్రభుత్వం, అధికారుల కృషితో బ్యాంకులు సమకూర్చుతున్న రుణాలను పంచుకోకుండా ఆర్థిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో మెప్మా సౌజన్యంతో మహిళా సంఘాలు చురుకుగా పనిచేస్తున్నాయి. పట్టణానికి చెందిన సూర్య గ్రూపు సభ్యులు చేపట్టిన కార్యక్రమాలే దీనికి నిదర్శనం.

బ్యాకరీ నిర్వహిస్తూ..

పట్టణంలోని వెంగళరావు కాలనీలో 2001 సంవత్సరంలో సూర్య గ్రూపును ప్రారంభించారు. ఈ సంఘానికి అధ్యక్షురాలిగా పైడితల్లి, కార్యదర్శిగా గంగాభవాని వ్యవహరిస్తున్నారు. వీరితోపాటు మరో 8మంది కలిసి బ్యాంకులు ఇచ్చిన రుణాన్ని సద్వినియోగం చేసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో బ్యాంకు ఇచ్చిన రూ.8 లక్షలతో బేకరీ యూనిట్‌ను ప్రారంభించారు. గ్రూపు సభ్యులు సమష్టిగా పనిచేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రొట్టెలు, రస్కులు, ఇతర బేకరీ తినుబండారాలను తయారు చేస్తూ స్థానికంగా అమ్మడమే కాక ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా విక్రయాలను సాగిస్తున్నారు. ఆరంభంలో కొంచెం ఇబ్బందులు పడినా సభ్యులంతా సహకరించడంతో వ్యాపార కార్యక్రమం సులభంగానే ఉందని మహిళలు తెలుపుతున్నారు. మెప్మా, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ గళ్లా సాయికుమార్ సంఘాలను ప్రోత్సహిస్తున్నారని వారు అంటున్నారు. నష్టాలు రాకుండా వారి కుటుంబ జీవనోపాధికి ఈ ఆర్థిక కార్యక్రమం దోహదపడుతుందని సూర్య గ్రూపు మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మ స్ఫూర్తి.. ఉద్యోగ దీప్తి !

ఒకరు డీఎస్పీ.. మరొకరు మేజర్

అంబాజీపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాను. మాది శ్రీకాకుళం జిల్లా కొర్లకోట. తల్లితండ్రు లిద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి, ఆపై ఇంటర్, ఇంజనీరింగ్ వైజాగ్‌లో పూర్తిచేశాను. రెండేళ్లపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కూడా చేశా. అమ్మ సుగుణవేణి పెళ్లయ్యాక కష్టపడి చదివి ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సాధించారు. చెల్లి ప్రతిభ ఆర్మీలో మేజర్‌గా మధ్యప్రదేశ్‌లో పని చేస్తోంది. అమ్మ, చెల్లి స్ఫూర్తితో 2013 నుంచి గ్రూప్స్‌కు ప్రిపేరయ్యా 2020లో గ్రూప్-2కు ఎంపికయ్యి ఎక్సైజ్ ఎస్ఐగా శ్రీకాకుళంలో తొలి పోస్టింగ్ వచ్చింది. ఏడాదిన్నర పాటు అక్కడ పనిచేశా. తర్వాత గ్రూప్-1 ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కఠోర శ్రమతో సాధన చేశాను. సమాజంలో యువత సోషల్‌మీడియా ప్రభావానికి గురికాకుండా.. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదువుకోవాలని సూచిస్తున్నా. పోలీస్ ఉద్యోగమంటే కత్తిమీదసాము లాటింది, అయినప్పటికీ తన చెల్లి మేజర్‌గా పనిచేస్తుండడంతో ఆమె అందించే ధైర్యసహాయంతో ఈ ఉద్యోగంలో చేరాను.





డీఎస్పీ శిక్షణ పూర్తిచేసుకుని కొత్తపేట సబ్ డివిజన్‌లో... కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు శిక్షణ పొందు తున్నాను. అంబాజీపేట ఎస్ఐగా తొమ్మిదివారాల పాటు శిక్షణ ఉంటుంది.

చెయ్యేరు టూ.. శ్రీహరికోట

- ఇస్రోలో శాస్త్రవేత్తగా రాణిస్తున్న తేజస్విని



కాట్రేనికోన, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఆమె సామాన్య రైతు కుటుంబంలో పుట్టి.. ఉన్నత విద్యనభ్యసించి శ్రీహరికోటలో సైంటిస్టుగా రాణిస్తూ పలువురి అభినందనలు పొందుతున్నారు. చెయ్యేరుకు చెందిన చిక్కం కాశీవిశ్వేశ్వరరావు, సత్యవతి దంపతుల కుమార్తె తేజస్విని. ఈమె ఒకటి నుంచి ఐదో తరగతి వరకు వివేకానంద పబ్లిక్ స్కూల్, ఆరు నుంచి పదోతరగతి వరకు అమలాపురం ఆదిత్య స్కూల్, అనాతవరం ప్రసిద్ధలో పాలిటెక్నిక్, బీవీసీ కళాశాలలో ఇంజనీరింగ్ చదివారు. ప్రస్తుతం రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో పనిచేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడుతూ భారత అంతరిక్ష కేంద్రంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. ఇస్రో వరుస విజయాలతో దూసుకుపోతోందన్నారు. ఉద్యోగంలో చురుగ్గా రాణిస్తూ కోనసీమకే ఆణిముత్యంగా నిలిచారు.

సుస్వరాణులు

- డోలు సన్నాయిలో ఉద్దండులు
- శాస్త్రీయ సంగీతంలో రాణిస్తున్న ఏడిద మహిళలు



శాస్త్రీయ సంగీతంలో రాణిస్తున్న వెంటూరి కుటుంబ మహిళలు

మండపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో శుభకార్యాలు, దేవాలయాల్లో ఉత్సవాలు, ప్రముఖుల సన్మానాల సమయంలో వినిపించే శాస్త్రీయ సంగీత వాయిద్యాలు డోలు సన్నాయి. భారతీయ శాస్త్రీయతకు అద్దం పట్టే డోలు సన్నాయి మేళమంటే తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. డోలు సన్నాయి అనే సరికి అందరు మగాళ్ల మాత్రమే కనిపిస్తారు. అలాంటి శాస్త్రీయ సంగీతంలో 80 ఏళ్ల చరిత్ర కలిగిన కళాకారుల కుటుంబ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామంలో ఉంది. కాని గ్రామానికి చెందిన వెంటూరి సాహెబ్ కుటుంబం 80 ఏళ్ల నుంచి శాస్త్రీయ సంగీత కళను పోషిస్తోంది. వీరి కుటుంబంలో 25 మందికి పైగా కళాకారులు వున్నారు. ఏడిదలో వెంటూరి సాహెబ్ డోలు సన్నాయి అంటే తెలియని వారుండరు. ఆ కుటుంబంలో పురుషుల తోపాటు మహిళలు సంగీతంలో రాణిస్తున్నారు. అలాగే మనుమరాళ్లు ఆయన కళను కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. కుటుంబ సభ్యులు వద్ద నేర్చుకున్న విద్యలో రాణిస్తున్న మహిళ కళాకారిణులు రాష్ట్రంలో సుప్రసిద్ధ దేవాలయాలు, రాజకీయ ప్రముఖుల ఇంట పెళ్లిళ్ల శుభకార్యాలలో వీరి కళ ద్వారా ఏడిద గ్రామానికి మంచి గుర్తింపు తీసుకువచ్చారు. వీరు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్నాటక, ఒడిస్సా రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. వీరి కళా నైపుణ్యానికి పలువురు సింహ తలాటాలు, గండపెండారాలు,బంగారు కడియాలు, వివిధ బహుమతులతో సత్కరించారు.



నాదస్వరంలో రాణించుతున్న సీతారత్నం సోదరిమణులు

పురుషులతో సమానంగా..

డోలు సన్నాయి మేళంలో డోలు, సన్నాయి, చిన్నహార్మోనియం బాక్సుతాళం ఉంటాయి. ఆరు నుంచి 8మంది వరకు బృందంగా కచేరి నిర్వహిస్తారు. సాధారణంగా మగవాళ్ల డోలు వాయించుతుంటే మహిళలు మాత్రం నాద స్వరం వాయించుతారు. ఎక్కడ వీరు కచేరి చేసినా అందులో ప్రత్యేక ఆకర్షణగా మహిళలు ఉంటారు. ఎక్కడ కార్యక్రమం జరిగినా కటుంబ సమేతంగా శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహిస్తుంటారు. తమ కుటుంబంలో మహిళలకు తామే శిక్షణ ఇచ్చి కళాకారులుగా తయారు చేస్తామని వెంటూరి సాహెబ్ మనుమడు వెంటూరి సాహెబ్(చిన్న) తెలిపారు.

మా నాన్న వద్ద నేర్చుకున్నాను

మా నాన్న వెంటూరి సత్యనారాయణ ఉచితంగా చాలామందికి డోలు సన్నాయి వాయిద్యం నేర్పించేవారు. అందరితోపాటు నేను కూడా వాళ్లతో నాద స్వరం నేర్చుకున్నాను. అనేక కచేరిలలో పాల్గొన్నాను. అప్పుడు నేర్చుకున్న విద్య ఇప్పుడు నన్ను కళాకారిణిగా గుర్తింపు తేవడంతోపాటు నా కుమారుడు కూడా డిగ్రీ చదువుకుంటూ నాతో పాటు ఈ రంగంలో రాణిస్తున్నాడు. ఇలా మా వంశ పారంపర్యంగా మా తాత నుంచి నేటి వరకు ఈ కళలో రాణించడం అదృష్టంగా భావిస్తున్నాను.

-డి.సీతారత్నం, సంగీత కళాకారిణి, మండపేట.

మంచి గుర్తింపు వచ్చింది



మా కుటుంబ సభ్యులతో కలిసి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఒడిస్సా తదితర రాష్ట్రాల్లో కూడా శుభ కార్యాలు, దేవాలయాల్లో జరిగే ఉత్సవాల్లో పాల్గొంటుంటాం. మా కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనే కార్యక్రమం మాకేంతో ఆనందాన్ని కలిగిస్తుంది. శాస్త్రీయ సంగీతానికి నేటికీ ప్రోత్సాహం తగ్గలేదు. ఈ కళ ద్వారా మాకు మంచి గుర్తింపు వచ్చింది.

-వెంటూరి రమాదేవి, సంగీత కళాకారిణి, ఏడిద.

మహిళ బలమే..కుటుంబ బలం

'నన్నయ' వీసీ ప్రసన్నశ్రీ.. జేఎన్టీయూకేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీలు ప్రసాద్,ప్రసన్నశ్రీ



జేఎన్టీయూకే, మార్చి7(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె కుటుంబాన్ని బలపరుస్తుందని ఒక కుటుంబం బలంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందని రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జేఎన్టీయూకేలోని అలూమ్నీ ఆడి టోరియంలో శుక్రవారం జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన, సాధికారత సమాన అవకాశాలను ప్రోత్సహించేందుకు మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు.తల్లి మొ దలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను మహిళ అలవోకగా నిర్వహించగలదన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు అవకాశాలు కోసం ఎదురుచూడకుండా అవకాశాలను అందిపుచ్చుకుని తమను తాము నిరూపించుకోవాలన్నారు. వర్సిటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు లక్ష్మీ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకూ రూ20,000 చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తుండగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతీ విద్యార్థినికి స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు ఫౌండేషన్ ఛైర్మన్ అవెంటెల్ కంపెనీ సీఈవో డాక్టర్ అబ్బూరి విద్యాసాగర్, మేనేజింగ్ ట్రస్టీ శారద ముందుకువచ్చారన్నారు. అనంతరం వీసీ ప్రసన్నశ్రీని సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. వర్సిటీ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ గ్రీవెన్సెస్ డైరెక్టర్ యూవీ రత్నకుమారి కోఆర్డినేటర్ వ్యవహరించిన ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఓఎస్డీ కోటేశ్వర రావు, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

10న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, మార్చి7 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కే.లచ్చారావు తెలిపారు. ఫైక్లాస్ కంపెనీల్లో గ్రోత్ అసోసి యేట్, భవి క్రియేషన్స్ కంపెనీలో డిజైనర్, టెలీకాలర్, మార్కెటింగ్ పర్సన్స్, ఆక్వా ప్రాసె సింగ్ కంపెనీలో వివిధవిభాగాలు, ఇసుజు మోటార్స్ ఇండో ఎం ఐఎం, హోండాయ్ మోబీస్, పానా సోనిక్, కెఐఎంఎల్ కంపె నీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు ఆ రోజు ఉదయం 9 గంటలకు కాకి నాడ కలె క్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376333లో సంప్రదించాలన్నారు.

అద్వితీయం.. సీతారామచంద్రస్వామి మహోత్సవం

సర్పవరం జంక్షన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో హనుమ, లక్ష్మణ సహిత సీతారామచంద్రస్వామి జీరోద్ధరణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం రెండోరోజూ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సీతారామచంద్రస్వామి జీరోద్ధరణ మహోకుంభ సంప్రోక్షణ కార్యక్రమాన్ని భీమవరం త్రిదండి రామచంద్ర జీయర్‌స్వామి, గోవింద జీయర్, త్రిదండి అహోబిలం రామానుజజీయర్ స్వామీజీ హాజరై ప్రారంభించారు. భక్తుల నడుమ వైభవంగా నిర్వహిస్తున్నారు.


సాలెగూడు.. అల్లె చూడు..!

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నరేంద్రగిరి కొండ మార్గంలో శుక్రవారం తెల్లవారుజామున మంచుకురిసే వేళలో పొదల మాటున ఓ సాలీడు గూడు అల్లుతుండగా ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా...

- ప్రత్తిపాడు



వేకువజామున గూడు అల్లుకుని..



తెల్లవారుతున్న సమయంలో తీగలమయమై...



తెల్లారేసరికి చెట్టు కొమ్మలకు వేలాడుతూ కనిపించి...

అభివృద్ధి పనులకు ఆమోదం

- అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సమావేశం
- 43 అజెండాలు ప్రవేశపెట్టిన అధికారులు
- పాత, కొత్త సీసీ కాటేజీ, ప్రకాష్‌సదన్ నందు సుమారు రూ.కోటితో మరమ్మతులు
- 70శాతం కేంద్రనిధులు, 30 శాతం దేవస్థానం నిధులతో కొండ దిగువున పనులు
- సత్యదేవుడి వార్షిక కల్యాణ నిర్వహణకు ఆమోదం

అన్నవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ ఆమోదం తెలిపారు. శుక్ర వారం జరిగిన ట్రస్టు బోర్డు సమావేశంలో ఈవో సుబ్బారావు, అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లు పాల్గొని 43 అజెండాలు ప్రవేశపెట్టారు. వాటిలో ప్రధానంగా రూ.39.75 లక్షలతో ప్రకాష్‌సదన్, రూ.39.95 లక్షలతో కొత్తసీసీ కాటేజీ, రూ.40లక్షల వ్యయంతో పాతసెంటినరీ కాటేజీలో మరమ్మతులు, లీకేజీలు అరికట్టడానికి రూపొందించిన అంచనా వ్యయాన్ని ఆమోదించి దేవదాయ కమిషనర్‌కు నివేదించాలని ఆమోదించారు. సత్యదేవుడి వార్షిక కల్యాణానికి రూ.27 లక్షలతో విద్యుద్దీప అలంకరణలు, లైవ్‌టెలికాస్టు, క్లాత్‌డెకరేషన్, తదితర పనులకు ఆమోదం లభించింది. కొండదిగువున భక్తుల సౌకర్యార్థం 70శాతం కేంద్రప్రభుత్వ నిధులు, 30 శాతం దేవస్థానం నిధులతో టాయిలెట్స్ నిర్మాణం, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలకు ఆమోదించి దేవదాయ కమిషనర్‌కు నివేదించాలని సూచించారు. వ్రత పురోహితులకు ప్రస్తుతం టిక్కెట్ల ధరపై ఇస్తున్న రెమ్యునరేషన్‌లో జీతాలు పోను ఏరియర్స్ రూపంలో ఇచ్చే మొత్తాన్ని 50 శాతం నుంచి 60శాతానికి పెంపు, కార్పస్ ఫండ్‌ను 50నుంచి 40శాతానికి తగ్గించి పురోహితుల వేతనాన్ని వార్షికపెంపు రూ.1000 నుంచి రూ.2000, పించన్‌ను రూ.500 నుంచి రూ.1000కి పెంచాలనే అభ్యర్థనను ఆమోదించి దేవదాయ కమిషనర్ ఆదేశాలతో అమలుచేయాలని పేర్కొన్నారు. స్వామివారి ప్రసాదానికి వినియోగించే ఆవు నెయ్యి కిలో రూ.590కి విజయాడైరీ, సంఘం డైరీలు లోయెస్ట్ టెండర్ కోట్ చేయగా వాటిని ఆమోదించారు. ఎండ వల్ల రత్నగిరిపై భక్తుల కాళ్లు కాలకుండా ఉండేందుకు రూ.3.65 లక్షలతో కూల్‌పేయింట్ వేయడానికి, రూ.22 లక్షలతో సత్యదేవుడి వార్షిక కల్యాణ నిర్వహణ, రూ.10 లక్షలతో రథశాల వద్ద పనులు, రూ.11.26 లక్షలతో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణాలకు వ్యయం, రూ.9లక్షలతో కేశఖండనశాల వద్ద టాయిలెట్ల నిర్మాణం, రూ.3.75 లక్షలతో దేవస్థానం ఆసుపత్రికి రంగులు, బలిఘట్టం సత్యదేవుడి ఆలయంలో అవసరమైన సిబ్బంది నియామకం తదితర పనులకు ఆమోదం లభించింది.

కారు ఢీకొని ఉపాధ్యాయుడి మృతి

అటవీ శాఖ ఉద్యోగినికి తీవ్ర గాయాలు



మృతిచెందిన చిన్నబ్బాయి

గోకవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందగా అటవీశాఖ ఉద్యోగిని తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. వై.రామవరం మండలం గాలిపాడు గ్రామానికి చెందిన వలల చిన్నబ్బాయి (52) జగ్గంపేట మండలం గోవిం దపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తు న్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. ప్రస్తుతం కుటుంబ సభ్యులతో గోకవరంలో నివాసముంటున్నారు. శుక్రవారం విధుల నిమిత్తం చిన్నబ్బాయి మోటారుసైకిల్‌పై పాఠశాలకు గోవిందపురం బయలుదేరారు. మార్గ మధ్యలో అటవీశాఖలో కొత్తపల్లి బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రెడ్డి విజయదుర్గ అనే ఉద్యోగిని ఆయనను లిఫ్ట్ అడిగారు. దీంతో ఆమెను కూడా మోటారు సైకిల్‌పై తీసుకెళ్తుండగా కొత్తపల్లి గ్రామ శివారున ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో కాకినాడ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు వారి మోటారుసైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నబ్బాయి అక్కడికక్కడే మృతిచెందగా విజయదుర్గకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో... సీఏలదే కీలకపాత్ర

ఐసీఏఐ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రసన్నకుమార్

కాకినాడ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో చార్టెర్డ్ అకౌంటెంట్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని ఇండియన్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఇనిస్టిట్యూట్ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. కాకినాడలోని చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఇనిస్టిట్యూట్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని భారత రత్న ఏపీజే అబ్దుల్ కలామ్ విగ్రహానికి, ఐసీఏఐ వ్యవస్థాపక అధ్యక్షుడు జీవి కపాడియా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఐసీఏఐ ఆధ్వర్యాన అమరావతిలో ఎంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. సంస్థ కాకినాడ చాప్టర్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు మాట్లాడుతూ జీఎస్‌టీ చట్టంపై అవగాహన కల్పించడంలో చార్టెర్డ్ అకౌంటెంట్స్ విశేష కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌ను శాలువాతో సత్కరించారు. కాకినాడ చాప్టర్ ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, కార్యదర్శి పాండు రంగమూర్తి కోశాధికారి సూర్యనారాయణ మూర్తి, లోక్‌నాథ్, వెంకటరమణ,చార్టెర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

పెళ్లి బృందం వ్యాన్ బోల్తా

ఏలూరు నుంచి అన్నవరం వెళ్తుండగా ప్రమాదం

పలువురికి స్వల్పగాయాలు



బోల్తా పడిన వ్యాన్

రాజానగరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వివాహం అనంతరం అన్నవరం సత్యదేవుని సన్నిధిలో వ్రతం జరిపించేందుకు నూతన వధూవరులు, బంధువులతో పయనమైన వ్యాన్ మార్గమధ్యలో తూర్పుగోదావరి జిల్లా తూర్పుగోనగూడెం వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలం జయపురం గ్రామం నుంచి నూతన వధూవరులు, బంధుగణంతో వ్యాన్‌లో అన్నవరం సత్యదేవుని దర్శనానికి బయల్దేరారు. మార్గమధ్యలో తూర్పుగోనగూడెం వద్దకు చేరుకునే సరికి వ్యాన్ స్టీరింగ్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి హైవే నుంచి సర్వీసు రోడ్డుకు అమర్చిన ఐరన్ మెస్‌తో పాటుగా విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొని వ్యాన్ బోల్తా పడింది. ప్రమాదంలో నూతన వధూవరులకు గాయాలేమీ కాలేదు. స్వల్పగాయాలైన కొందరికి 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. సమాచారం అందుకున్న రాజానగరం ఏఎస్ఐ మణి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం బంధువులంతా అన్నవరం వెళ్లారు.

చెట్టు పై నుంచి పడి యువకుడి మృతి

మారేడుమిల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుండాడ పంచాయతీ కుండాడ గ్రామానికి చెందిన కుండ్ల సురేష్ రెడ్డి(27) చింత పండు కోసేందుకు చెట్టు పైకి ఎక్కి కాలు జారి కింద పడిపోయాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

జనసేనలోకి మాజీ ఎమ్మెల్యే దొరబాబు

కండువా కప్పి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్


అదే బాటలో జడ్పీ వైస్‌చైర్మన్, పలువురు ప్రజాప్రతినిధులు



పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన మాజీ ఎమ్మెల్యే దొరబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్

పిఠాపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం దొరబాబుకు పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు జనసేనలో చేరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కొత్తపల్లి పద్మబుజ్జి, ఏఎంసీ మాజీ చైర్మన్ మొగలి బాబ్జీ, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపల్లి చినబాబీ, డాక్టర్ సెల్స్ విభాగానికి చెందిన డాక్టర్ పంతం రాథేష్, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం మాజీ చైర్మన్ రెడ్డెం జనార్ధన్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు సహా పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సొసైటీ అధ్యక్షులు, వైసీపీ కీలక నేతలు జనసేనలో చేరగా వారిని పవన్ ఆహ్వానించారు. మరికొంత మంది వైసీపీ సర్పంచ్‌లు, ముఖ్యనేతలను రాష్ట్ర మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీలోకి ఆహ్వానించి జనసేన కండువాలు కప్పారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులున్నారు.

తాటిపర్తిలో ఉభయ తెలుగురాష్ట్రాల నాటక పోటీలు ప్రారంభం



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో నాటక పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై ఈనెల 12వరకూ జరిగే ఈ పోటీలను జనసేన నాయకుడు ఓదూరి కిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అపర్ణా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, ప్రధాన అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి, జనసేన మండలాధ్యక్షుడు అమరాది వల్లీ రామకృష్ణ, మాజీ సర్పంచ్ చల్లా సత్యనారాయణమూర్తి, నాటక కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

అమలాపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కారు బాడుగ విషయంలో పార్టనర్స్ మధ్య ఏర్పడిన వివాదంలో మాటామాటా పెరగడంతో మనస్తాపం చెందిన వివాహిత అంకల వల్లీశ్రీదుర్గ (32) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు శుక్రవారం తెలిపారు. మృతురాలి తల్లి అంకల రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహానికి శవపంచనామా పూర్తి చేసి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అమలాపురం ముస్లింవీధికి చెందిన వల్లీశ్రీదుర్గ అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన సానబోయిన శివాజీ ప్రైవేటు బ్యాంకులో పనిచేసేవారు. వారిద్దరు కలిసి బ్యాంకులో లోను తీసుకుని కిరాయికి తిప్పేందుకు కారును కొనుగోలు చేశారు. రూ.2.80లక్షలు పేమెంట్‌గా చెల్లించి రూ.7లక్షలు ఫైనాన్స్ మీద కారును తీసుకుని గత కొంతకాలంగా కిరాయికి తిప్పుతున్నారు. గతంలో కిరాయి డబ్బులు పంపకాల విషయంలో ఎటువంటి వివాదాలు లేవు. ఇటీవల కుంభమేళాకు వెళ్లిన కారు మరమ్మతులకు రావడంతో కారును తాను నడుపుతానని శివాజీ పట్టుబట్టాడు. దానికి తోడు కిరాయి విషయంలో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడింది. సక్రమంగా కిరాయి సొమ్ములు ఇవ్వడం లేదని ఇటీవల జరిగిన అనేక విషయాలను వివరిస్తూ వల్లీశ్రీదుర్గతో శివాజీ ఘర్షణకు దిగాడు. మాటామాటా పెరిగింది. దాంతో మనస్తాపం చెందిన వల్లీశ్రీదుర్గ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త రెడ్డి సతీష్‌తో పాటు ఒక పాప ఉంది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు.

ఫ్యాన్‌కు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కాకినాడ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం కాకినాడలో జరిగింది. బ్యాంక్‌పేటకు చెందిన వి.అనీల్‌కుమార్ (22) అవివాహితుడు. ఆనంద్ థియేటర్ సమీపంలో ఓ చార్టెర్డ్ అకౌంటెంట్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆ యువకుడికి ఏమి కష్టం వచ్చిందో తెలియదు కానీ గురువారం రాత్రి అనీల్‌కుమార్ కుటుంబమంతా భోజనం చేసి నిద్రించారు. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో తండ్రి రవికుమార్ లేచి చూసేసరికి అనీల్‌కుమార్ గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో అనీల్ కుమార్ మృతిచెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అపహరణ కేసులో...

నిందితుడి అరెస్ట్

గోకవరం, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బాలిక అపహరణ కేసులో రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన యువకుడు రాయుడు శివను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ వీఎన్‌వీ పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదుతో ఈనెల 5న మిస్సింగ్ కేసుగా నమోదు చేశామన్నారు. బాలికను శివ పెళ్లి పేరుతో అపహరించుకుపోయినట్టు తేలడంతో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ పేర్కొన్నారు.

బస్సు డ్రైవర్ మృతదేహం అప్పగింత

ఏలూరు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ప్రమాదంలో మృతిచెందిన డ్రైవర్ మృతదేహానికి శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లా ములగవలస గ్రామానికి చెందిన ముంగంటి మధుసూధనరావు (38) 10 ఏళ్ల నుంచి కాకినాడలో ఉంటూ రమణా ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరు సమీపంలోని మెయిన్‌బైపాస్ చొదిమెళ్ళ వద్ద హైవే మధ్యలో పంచర్ అయి ఆగిపోయిన సిమెంటు లారీని రమణ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తూ ఈనెల 6న వేకువజామున ఢీ కొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మధుసూధనరావు, మరో ముగ్గురు ప్రయాణికులు మరణించారు. మృతుడి ఆచూకీ గురువారం గుర్తించారు. బంధువులు శుక్రవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఏలూరు రూరల్ ఎస్ఐ సీదుర్గాప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ జీవరత్నం పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు.

కాకినాడలో ఏడు పరిశ్రమలకు నోటీసులు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏడు పరిశ్రమలు వాటి నీటి వినియోగ చార్జీలు 2019 నుంచి నేటి వరకు సుమారు 87 కోట్ల 21లక్షల 91వేల రూపాయలు బకాయి ఉన్నందున వాటికి నోటీసులు జారీ చేసినట్టు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న నాగార్జున ఫెర్టిలైజర్స్, కాకినాడ సీపోర్ట్, జీఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్, ఎంపీ శశిధర్ అండ్ కో, అశోక ఎంటర్‌ప్రైజెస్, అంజనీ ఏజెన్సీస్, అన్నపూర్ణ మైరెన్స్ నుంచి సుమారు రూ.87కోట్ల 21లక్షల 91వేలు నీటి వినియోగ బకాయిలు తక్షణం చెల్లించాలని నోటీసులు జారీ చేశామని స్పందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడు బొంతు రాజీనామా

అమలాపురం రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో తగిన గుర్తింపు లేకపోవడంతో మండలశాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్టు బొంతు గోవిందుశెట్టి తెలిపారు. రాజీనామా లేఖను శుక్రవారం వైసీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ కార్యాలయంలో అందజేశారు. రాజీనామా లేఖలను మీడియాకు అందించారు.

ఉద్యోగులకు సత్కారం

యానాం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక మదర్ థెరిస్సా నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్నినిర్వహించారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణా సుధాకర్ పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులుఉద్యోగాలు సాధించిన ఉషారాణి, కృష్ణాకుమారి, మంగతాయురులను సత్కరించారు.

రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



ఈదరాడలో దాళ్వా వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

మామిడికుదురు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి డి.బోసుబాబు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఈదరాడ, నగరం, పాశర్లపూడి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వరి చేలను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 3600మంది రైతులు 3500ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నారన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం జీవామృతం, సేంద్రీయ ఎరువులు వాడి ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. జిల్లాలో ప్రతీ రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని, ఇప్పటి వరకు 1.28లక్షల మంది మాత్రమే నమోదు చేయించుకున్నారని, మిగిలిన రైతులు కూడా ఈవిశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. గడువు ఈనెలాఖరు వరకు మాత్రమే ఉందన్నారు. ఏవోలు కె.శ్రీనివాస్, మృదుల, అగ్రికల్చర్ అసిస్టెంట్ లావణ్య, మహిళా రైతులు కుసుమ, పద్మావతి, చెల్లుబోయిన రాధ, కుడుపూడి జానకి తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ నిర్మాణంపై సీబీఐతో విచారణ చేయించాలి



పాశర్లపూడిలో బైపాస్ నిర్మాణంపై సీబీఐతో విచారణ చేయించాలని నిర్వాసితుల నిరసన

మామిడికుదురు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి నుంచి గుడిమెళ్లంక వరకు నిర్మిస్తున్న బైపాస్‌పై సీబీఐ చేత విచారణ నిర్వహించాలని బైపాస్ నిర్వాసితులు శుక్రవారం పాశర్లపూడిలో నిరసన చేపట్టారు. జాతీయ రహదారి విస్తరణ నిమిత్తం 2014లో గెజిట్ వేశారని, దానిని రద్దు చేయకుండా 2016లో మరలా గెజిట్‌వేసి అక్రమ బైపాస్ నిర్మాణాన్ని చేపట్టారని, ఇది క్రిమినల్ చర్య అని పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి బైపాస్ నిర్మాణంపై సుమారు హైకోర్టులో 2016 గెజిట్‌కు వ్యతిరేకంగా 60 కేసులు వేశారని, అవి కోర్టులో పెండింగ్‌లో ఉండగా బైపాస్ రోడ్డు ఎలా నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. 1956 భూసేకరణ చట్టం ప్రకారం ఎలైన్‌మెంట్ మార్పు తీవ్రమైన చర్యగా గుర్తించి దీనిపై పూర్తిస్థాయిలో సీబీఐతో విచారణ నిర్వహించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గెడ్డం కృష్ణమూర్తి, చొల్లంగి ధర్మరాజు, నీతిపూడి గణపతిరావు, నయినాల సత్యంమూర్తి, బండారు సరయ్య, కుసుమ శివ, గెడ్డం సరస్వతి, కోటూం ధనలక్ష్మి, గెడ్డం నరసమ్మ, మందసరస్వతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ప్రార్థనలు

మామిడికుదురు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రంజాన్ నెలలో మొదటి శుక్రవారం ప్రార్థనలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మామిడికుదురులోని సున్నీ, షియా జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత ప్రబోధకులు తారిఖ్‌అన్వర్‌రజ్వీ, షబ్బర్‌అలీజైదీలో రంజాన్ నెలలో శుక్రవారం విశిష్టతను భక్తులకు వివరించారు. రంజాన్ నెలలో చేసే ప్రార్థనల వల్ల సంవత్సర కాలంలో చేసిన పాపాలు తొలగిపోతాయని, స్తోమత ఉన్నవారు పేదలకు దానధర్మాలు చేయాలని మతప్రబోధకుడు భక్తులకు నిర్దేశించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

వంటా - వార్పుతో నిరసన

అల్లవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని, గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుంటే ఓఎన్జీసీపై పోరాటం ఉధృతం చేస్తామని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, కూటమి నాయకులు హెచ్చరించారు. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద ఐదో రోజు శుక్రవారం రిలే నిరసనతో పాటు వంటా-వార్పు చేసుకుని నిరసన తెలిపారు. ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నా ఓఎన్జీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, గుర్రం కృష్ణ, వడ్డి ఎలీషారాజ్, గుండుమేను శ్రీనివాస్, మందపాటి రామకృష్ణ, పినపోతు రామకృష్ణ, రేకాడి శేషగిరి, తాడి ధర్మేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



అమలాపురం యూనియన్ బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

అమలాపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు ఈనెల24,25 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం కోనసీమలోని అన్ని బ్యాంకులకు చెందిన బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది నిరసన తెలిపారు. 300మంది బ్యాంకు సిబ్బంది అమలాపురం యూనియన్ బ్యాంకు మెయిన్ బ్రాంచి వద్దకు చేరుకుని పెద్దఎత్తున నినాదాలు చేశారు. బ్యాంకుల్లో అన్ని కేడర్లలో కొత్త సిబ్బందిని నియమించాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఐదురోజుల పనిదినాలను అమలు పరచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. ఛైర్మన్ పీవీవీ సత్యనారాయణ, కన్వీనర్ గణేష్‌కుమార్, కార్యదర్శి బి.శ్రీనివాస్, ఎల్డీఎం కేశవవర్మ, మేనేజర్లు బి.వెంకటేశ్వరరావు, సురేష్‌కుమార్, రమేష్, సత్యనారాయణ, వైఎల్ ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిబ్బంది ఆందోళన

యానాం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని కోరుతూ యానాం ప్రభుత్వ పాఠశాలలో 23ఏళ్లుగా పనిచేస్తోన్న మిల్క్ బాయిలర్లు చేస్తున్న ఆందోళన కొనసాగుతుంది. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలోని జెండా స్తంభం వద్ద చేపట్టిన ఆందోళనలో సిబ్బంది నినాదాలు చేశారు. తక్షణం ప్రభుత్వం చేసిన ప్రకటనను అమలు చేయ్యాని, తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఉదయం పాఠశాలలో విధులు నిర్వహించిన అనంతరం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారికి యానాం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఆర్ధాని దినేష్, కాటంశెట్టి రామూర్తి, మల్లాడి సత్తిబాబు పలువురు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జనసేన సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్

ముమ్మిడివరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో జనసైనికులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం బీఎస్ ఫంక్షన్ హాలులో దూడల స్వామినాయుడు అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో వారుమాట్లాడారు. ఈనెల14న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ వద్ద జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ సభ పరిశీలకుడు రాయపురెడ్డి కృష్ణ, చిలకలపూడి పాపారావులు సమావేశానికి హాజరై ఆవిర్భావ సభకు సంబంధించిన జనసేకరణపై సూచనలు, సలహాలిచ్చారు. గుద్దటి జమి, గోదశి పుండరీష్, ముత్యాల జయలక్ష్మి, మద్దింశెట్టి పురుషోత్తం, కర్రా దుర్గాప్రసాద్, మోకా బాలప్రసాద్, అత్తిలి బాబూరావు, గాలిదేవర బుల్లి, అంగాని నరసింహమూర్తి పాల్గొన్నారు.

పాదరక్షలు పంపిణీ

అల్లవరం,మార్చి7(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్ సీడ్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు చిన్నారులకు పాదరక్షలు, మిఠాయిలు పంచారు. అంగన్‌వాడీల్లో చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. సాధనాల శ్రీనివాస్, కాశి బాలయోగి, పెనుమాల విక్రమ్, కడలి రాజు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం



భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తిని సన్మానిస్తున్న మహిళలు

అమలాపురం రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు ప్రదీప్తి బహుమతులు అందజేశారు. మహిళల అభ్యున్నతి కోసం, విద్యకోసం సావిత్రీబాయిఫూలే చేసిన పోరాటాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు. ఉమెన్స్ వెల్ఫేర్ సెల్ సభ్యులు ఎంహెచ్ఎస్ పద్మ, ఎన్.సుష్మ, వి.పద్మశ్రీ, బి.కృష్ణవేణి ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీని సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌సీఎస్ మదన్, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, సీతా రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికే ఆదర్శంగా భారత నారి

ఉప్పలగుప్తం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భారత మహిళ ప్రపంచానికే ఆదర్శంగా అన్ని రంగాల్లోనూ దూసుకుపోతోందని మహిళాదినోత్సవంలో వక్తలు వ్యాఖ్యానించారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ నాయకురాలు, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి నేటి సమాజంలో మహిళ బాధ్యత ఎంతో కీలకమైనదన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. నాగరత్నకుమారి సమక్షంలో పది మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అరవ నాయుడు, కామన మధుసూదనరావు, లక్ష్మి, శారద, పూర్ణిమ, అనూరాధ, అనంతలక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

పేదల కోసం ప్రధానమంత్రి జనరిక్ కేంద్రాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక భారంతో ఉన్న పేద వర్గాలకు ప్రధానమంత్రి జన ఔషధీ కేంద్రాలు వరంగా మారాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ప్రధానమంత్రి జన ఔషధీ కేంద్రం ఏడవ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పీఎం జన ఔషధీ కేంద్రాల్లో 50 నుంచి 90శాతం అతితక్కువ ధరలకే బ్రాండెడ్ మందులతో సమానమైన నాణ్యత గల మందులు లభిస్తున్నాయన్నారు. అన్నిరకాల జబ్బులకు మందులు తక్కువ ధరకు దొరుకుతాయని వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ జిల్లాలో పది జన ఔషధీ కేంద్రాలు నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు,డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేవీ రూపేష్, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, అధికారి జయవెంకటలక్ష్మి, మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, పొలమూరి ధర్మపాల్, నల్లా చిట్టిబాబు, వలవల శివరావు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి బీమా రక్ష

అమలాపురం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ తమ కుటుంబానికి రక్షణ కల్పించుకోవాల్సిన బాధ్యత ఉందని టాటా ఏఐఏ హెడ్ ఆఫ్ ది ఏజెన్సీ సీతాకాంత్ మహాపాత్రో పేర్కొన్నారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకుండా ప్రతీ ఒక్కరూ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. కోనసీమ కేంద్రమైన అమలాపురం గోఖలే సెంటర్‌లో శుక్రవారం టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్సు నూతనశాఖ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. 2019లో విజయవాడ సెక్టార్ నుంచి రూ.కోటితో ప్రారంభమై 2024 నాటికి రూ.130కోట్ల టర్నోవర్‌కు ఇన్సూరెన్సు కంపెనీ చేరిందని వివరించారు. 2047నాటికి ప్రతీ ఒక్కరూ ఇన్సూరెన్సు పొంది ఉండాలనే నిబంధనతో రాష్ట్ర వ్యాప్తంగా మరెన్నో బ్రాంచీలు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు.

బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

ముమ్మిడివరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ వారు వైద్యసేవలు అందించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్మైల్ ట్రైన్ ఫౌండేషన్ సహకారంతో బసవ తారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రివారు శుక్రవారం ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రహణ మొర్రి, గ్రహణశూల ఉన్న పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరంలో డీఈవో షేక్ సలీంబాషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ ముకుందరెడ్డి మాట్లాడుతూ గ్రహణం మొర్రి, గ్రహణశూల ఉన్న పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సను ఉచితంగా చేయిస్తామన్నారు. శిబిరానికి వచ్చిన 44మంది చిన్నారులను పరీక్షించి వారిలో 36మందిని ఆపరేషన్‌కు సిఫార్సు చేశామన్నారు. వీరిందరికీ హైదరాబాద్ బసవ తారకం కేన్సర్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు.

పైపులైన్ తొలగిస్తే తాగునీటికి ఇబ్బందులు

పి.గన్నవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం-అంబాజీపేట ఏజీ రోడ్డులో పోతవరం వద్ద రోడ్డు పనుల్లో భాగంగా తాగునీటి పైపులైన్‌ను తొలగిస్తే తాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవీంద్రబాబు అన్నారు. పోతవరం వద్ద జరుగుతున్న రోడ్డు పనులను జేఈ కల్యాణ చక్రవర్తితో కలిసి పరిశీలించి అనంతరం మాట్లాడారు. పైపలైన్‌ను తొలగిస్తే వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్ అండ్‌బీ అధికారులకు సూచించినట్లు ఆయన చెప్పారు. ఈసమస్యను శనివారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునే దిశగా చర్యలు తీసుకుంటామని ఇరుశాఖల అధికారులు ఒక నిర్ణయం తీసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వెంట సర్పంచ్‌లు వడలి కొండయ్య, కుంపట్ల నాగలక్ష్మి, ఎస్.లక్ష్మణరావు, బంగారు నాయుడు, చంద్రకళ, తోరం వీరవెంకట సత్య నారాయణ, నాయకులు గనిశెట్టి శ్రీనివాసరావు, చిన్నం బాలవిజయరావు, దొమ్మేటి శివరామన్ తదితరులు పాల్గొన్నారు.

'మాట తప్పిన ప్రభుత్వం'

మలికిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో సూపర్-6 పథకాల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యమని చెప్పి, ఇప్పుడు జిల్లా పరిధిలో మాత్రమే అని చెప్పడం మాట తప్పడమేనని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు అన్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లినా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తుందన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

అమలాపురం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఈబీసీ (ఈడబ్ల్యుఎస్) కులాలకు చెందిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ 2024 పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించనున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి పి.సత్యరమేష్ తెలిపారు. శిక్షణ పొందగోరేవారు అమలాపురంలోని బీసీ సంక్షేమశాఖ జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. బీసీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులు ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించాలన్నారు. టెట్‌లో అత్యధిక మార్కులు పొందిన అభ్యర్థులకు మాత్రమే ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, టీటీసీ, టెట్ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్‌పుస్తకం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను ఈనెల10వ తేదీ నుంచి జిల్లా కార్యాలయంలో అందించాలని కోరారు. ఈఅవకాశాన్ని బీసీ, ఈబీసీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సెల్ 9398973754, 9440403629ను సంప్రదించాలన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దెందుకూరి ప్రమాణ స్వీకారం

అల్లవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శుక్రవారం విజయవాడలో ప్రమాణ స్వీకారంచేసి బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న సత్యనారాయణరాజు(కనకరాజుసూరి)తో పాటు డైరెక్టర్లతో కార్పొరేషన్ ఎండీ మహేశ్వర్‌రెడ్డి విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయించారు. స్వగ్రామానికి వచ్చిన దెందుకూరిని కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

మలికిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి అన్నారు. మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాల సెమినార్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వారు మాట్లాడుతూ నేటి తరుణంలో ప్రతీ మహిళ అన్ని రంగాల్లోను ముందుండాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్నింటా సమాన అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని మనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులను, పలు రంగాల్లో సేవలు చేసిన మహిళా నాయకులు సన్మానించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్వేది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో జడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీపీ మల్లిబాబు అధ్యక్షతన శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నేటి సమాజం వారికి వెన్నంటే నిలుస్తుందని జడ్పీటీసీ అన్నపూర్ణ అన్నారు. అంతర్వేది మధ్యగ్రూపు పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

నేడు జిల్లా స్థాయిలో మహిళా దినోత్సవం

అమలాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో శనివారం జిల్లాస్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. వేడుకల నిర్వహణకు సంబంధించి చేసిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. మహిళలను గౌరవించి అధికారికంగా గుర్తింపు ఇవ్వడమే లక్ష్యంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తదితర ప్రముఖ చేతులమీదుగా వివిధరంగాల్లో విశిష్ట స్థాయిని సాధించిన మహిళలను సన్మానించనున్నట్టు జేసీ తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించి ఉత్తమంగా నిలిచిన సంక్షేమ పథకాల స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికార దిశగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవాలన్నారు. ఆమె వెంట డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డీపీఎం విజయకుమార్ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

అయినవిల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డిపార్టుమెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు అన్నారు. శుక్రవారం అయినవిల్లిలో శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో మేడిద దుర్గాప్రసాద్, తోలేటి ఉమ, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, సర్పంచ్ కాకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ సభకు తరలిరండి

మలికిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఈ నెల 14న నిర్వహించే జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్, ఆవిర్భావ సభ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు, మరో సమన్వయకర్త లింగోలు పెద్దబ్బులు పిలుపునిచ్చారు ఇప్పటికే జనసేన నాయకులు గ్రామాల్లో సభ విజయం కోసం పర్యటిస్తున్నారన్నారు.

హామీలు వెంటనే అమలుచేయాలి

అంతర్వేది, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలని సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్లతో మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఎన్నో ఏళ్లగా నమ్ముకున్న ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. హెచ్‌ఆర్పీ పాలసీ, మినిమం టైంస్కేలు అమలుచేసి ఇతర సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని, వేతనాలు పెంచాలన్నారు. ఈనెల11న విజయవాడ కేంద్రంగా నిరసన దీక్షలు చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో రజనీకుమారి, లక్ష్మీబాయి, సంధ్యాదేవి, శాంతి, కమల, శ్రీనివాస్, సాగర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయాల రికార్డుల స్వాధీన ప్రక్రియ

యానాం,మార్చి 7(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీవేంకటేశ్వర ఆలయ సముదయానికి సంబంధించి పుదుచ్చేరి దేవదాయశాఖ (హెచ్ఆర్ఐ) ఆధీనంలోని వివిధ ఆలయాల రికార్డులను పూర్వ కమిటీ ప్రతినిధుల నుంచి స్వాధీన ప్రక్రియ కొనసాగుతోంది. యానాం ఆలయ కార్యనిర్వహణాధికారి జ్యోతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యానాం పిల్లారాయ ఆలయంలో పలువురు ఉన్నతాధికారులు సమక్షంలో రికార్డుల స్వాధీన ప్రక్రియ జరుగుతుంది. రికార్డులను తీసుకున్న అనంతరం ఆలయాలకు సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలు అందజేయనున్నారు. ఈ ప్రక్రియ మరికొద్ది రోజుల పాటు సాగనుంది. ఈ కార్యక్రమాన్ని పరిపాలనాధికారి మునిస్వామి పరిశీలించారు.

పీ-4 శిక్షణా తరగతులు

ముమ్మిడివరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దారిద్రయ రేఖకు దిగువన్న ప్రజలు ఇంకా కనీస సౌకర్యాలు పొందలేనటువంటివారి సమాచారాన్ని ఖచ్చితంగా సేకరించాలని ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులకు శుక్రవారం నిర్వహించిన పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పార్టనర్ షిప్ పి-4 శిక్షణ కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామంలో వంద మందిలో 20మందిని సర్వే చేయాలన్నారు. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వం వారికి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. తహశీల్దార్ ఎం.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ సర్వే నిర్వహించే అధికారులు నిశితంగా పరిశీలించి సమగ్ర నివేదిక అందించాలన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

మామిడికుదురు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర సర్వే ట్రైనింగ్ అకాడమీ సంయుక్త సంచాలకుడు సీహెచ్‌వీఎస్ఎన్ ప్రసాద్ సూచించారు. ఈదరాడలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ రైతుల సమక్షంలో రీసర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించి ఏమైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి సిబ్బంది కృషి చయాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వికాస ఆధ్వర్యంలో మహిళా జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని వికాస జిల్లాశాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం మహిళా జాబ్‌మేళా నిర్వహించారు. ఫాక్స్‌కాన్ ఐఫోన్ మానుఫ్యాక్చరింగ్ కంపెనీకి 28మంది ఇసుజు మోటారు కంపెనీకి ఎనిమిది మందిని ఎంపికచేసినట్టు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. మహిళా జాబ్‌మేళాకు 120మంది నిరుద్యోగులు హాజరుకాగా 36మంది యువతులను ఉద్యోగాలకు ఎంపికచేశారు. ఎంపికైన వారికి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి నియామక ఉత్తర్వులు అందించారు.

రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు

రాజోలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం రాజోలులో మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతీ రైతు ఆధార్ నంబరు, ఆధార్ అనుసంధాన ఫోన్ నంబరు, పట్టాదారు పాసుపుస్తకంతో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పోర్టల్‌లో లాగిన్ అయి పదకొండు అంకెల ప్రత్యేక విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు.

అన్యమత ప్రచారంపై ఫిర్యాదు

అంతర్వేది, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల వైభవంగా జరిగిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది పరిసర ప్రాంతాల్లో స్వామివారి ఫొటోతో ఉన్న ఫ్లెక్సీలు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేశారు. అంతర్వేది దేవస్థానం చెరువు సమీపంలో ఉన్న స్వామివారి ఫ్లెక్సీపై అన్యమత ప్రచార పత్రికలు అంటించిన వారిని శిక్షించాలంటూ సఖినేటిపల్లి ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్‌కు స్థానిక గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్వామివారి ఫ్లెక్సీలు చించిన, అన్యమత ప్రచార పత్రికలు అంటించిన వారిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ఎస్ఐ దుర్గాశ్రీనివాస్‌ను జనసేన నాయకులు ఎంపీటీసీ భైరా నాగరాజు, దంగేటి బాబి, బీజేపీ నాయకుడు పోతురాజు సురేష్, టీడీపీ నాయకులు పొన్నాల విజయ్, దాసరి వాసు, సుబ్రహ్మణ్యం, కె.వీరబాబు, బందన ప్రసాద్, ఎం.సాయి, సత్తిబాబు, నాని, పినపోతు కృష్ణ, గ్రామస్తులు కోరారు.

కారు గ్యారేజీలో అగ్ని ప్రమాదం

ఆలమూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కారు గ్యారేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు కార్లు దగ్ధమయ్యాయి. ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారి చెంతన ఉన్న గ్యారేజీ వెలుపల గురువారం అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. దగ్ధమైన కార్ల విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని గ్యారేజీ యజమాని తెలిపారు. హైవే పోలీసు సిబ్బంది అక్కడకి చేరుకుని మంటలను అదుపు చేశారు.


గ్యారేజీలో దగ్ధమవుతున్న కారు

రేపటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు


అంగరలోనున్న వేణుగోపాలస్వామివారు

కపిలేశ్వరపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 9న స్వామివారి పంచామృత స్నపనం, పెళ్లి కుమారుడు, కుమార్తెలను చేయడం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పోలేరమ్మ ఆలయం వద్ద తీర్థం, రాత్రి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 11, 12 తేదీల్లో పలు అర్చనలు, నిత్య హోమాలు, బలిహరణ నిర్వహిస్తామన్నారు. ఆలయ అర్చకుడు సంపర వేణుగోపాల సింగుబాబు ఆచార్యులుతో 13న నూకాలమ్మ ఆలయం వద్ద చోరసంవాద కథాశ్రవణం, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 14న కణ్వనది వద్ద చక్రస్నానం, స్వామివారికి గరుడ, అశ్వ, గజ, సర్ప, ఆంజనేయ వాహనాలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈనెల 15న స్వామివారి పుష్పయాగం, 16న అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాంబాబురెడ్డి తెలిపారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీవైఈవో

రాయవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల యూపీ పాఠశాలను శుక్రవారం రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను పరీక్షించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డి ఆధ్వర్యంలో డీవైఈవోను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.రాంబాబు, చంద్రకళ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


లొల్లలో డీవైఈవోను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

'సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం'

మండపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. తక్షణమే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్ర వారం మండపేటకు వచ్చిన ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, ప్రతి ఆడపిల్లకు రూ.15,000 నగదు ఇస్తామన్న వంటి పలు హామీలు అమలు చేయలేదన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రజా సమస్య లపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ఆయన చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కొత్తూరి శ్రీనివాస్ తదితరులువున్నారు.

శివకోటిని పరామర్శించిన గిడుగు: పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు శివకోటి శేషసుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కొత్తూరి శ్రీనివాస్ తదితరులు ఆయన్ను పరామర్శించారు.


శివకోటిని పరామర్శిస్తున్న గిడుగు

గ్రామాభివృద్ధికి సహకరించండి


డీఎల్‌పీవోతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఆలమూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి సహకరించాలని డీఎల్‌పీవో రాజుకు మూలస్థానం గ్రామస్తులు వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం గ్రామంలో ఆయనతోపాటు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజు పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లంక వరప్రసాదరావు, ఎంపీటీసీలు యర్రంశెట్టి మంగాదేవి, భావిశెట్టి తాతాజీ గ్రామస్తులతో కలిసి డీఎల్‌పీవోకు సమస్య లు తెలిపారు. రామాలయం వెనుక ఉన్న చెరువు పూడికతో నిండిపోయి నీరు నిల్వ చేసే మార్గం లేక చిట్టడివిని తలపించేలా మారిందని గ్రామస్తు లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిరుప యోగంగా ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీనిపై రాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ కార్యదర్శి చిక్కాల వీరమాత, పంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.79లక్షలు

ఆత్రేయపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,79,482 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఆలయంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఉపకమిషనరు పరిశీలించారు. గోశాల నిర్మాణ పనులను పరిశీలించి వారి పలు సూచనలు చేశారు.

11న కైలాసేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ

మండపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏడిదలో పునర్నిర్మించిన కైలాసేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠను ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని దేవదాయ, ధర్మాదాయశాఖ నిధులతోపాటు, దాతల సహకారంతో పునర్నిర్మించారు. ఆలయంలో తొలగించిన విగ్రహాలనుపునః ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. ఈనెల 11న యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, 12న ధ్వజారోహణం, వాస్తుపూజ, హోమం, జరుగుతాయన్నారు. 13, 14, 15 తేదీల్లో పలు కార్యక్రమాల అనంతరం అన్న ప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


ఏడిదలో పునర్నిర్మించిన ఆలయం

నేడు మండల పరిషత్ సమావేశం

మండపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి) మండపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. దీనికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు.

శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం

జిల్లా ఎస్పీ కృష్ణారావు

ఆత్రేయపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీస్‌శాఖ తమ వంతు సహకారం అందించేలా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ పి.కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌ను ఆయ న తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సం తృప్తి వ్యక్తం చేశారు. వాడపల్లికి భక్తుల రద్దీ పెరిగిపోవడంతో మరికొంత మంది సిబ్బందిని నియమించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కాటన్ బ్యారేజీ వద్ద రొయ్యసీడ్ సేకరణలో రెండు ప్రాంతాల మధ్య జరిగే వివాదాన్ని పరిష్కరిస్తామన్నారు. శాంతి భద్రతలు, క్రైమ్ రేటు అదుపులో ఉందన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ ద్వారా మరికొంత మంది సిబ్బందిని స్టేషన్లకు నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్ బాధితులకు సెల్‌ను అందిస్తున్న జిల్లా ఎస్పీ

13 వరకు గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు

ద్రాక్షారామ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలో జీఎంసీ బాలయోగి బాలురు గురుకుల పాఠశాలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకోవడానికి గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ చింతా శ్రీనివాసరావు తెలిపారు. 6వ తేదీగా ఉన్న గడువు 13న సాయంత్రం 5 వరకు పొడిగించామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441563110లో సంప్రదించాలని కోరారు.

ఆశావర్కర్ల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

ద్రాక్షారామ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ అన్నారు. ఆశావర్కర్లకు ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచారన్నారు. తొలి రెండు ప్రసవాలకు సంబంధించి 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు, ఉద్యోగ విరమణ తరువాత రూ.1.5 లక్షలు గ్రాట్యుటీ చెల్లించేందుకు నిర్ణయించారన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 42,752 మందికి ప్రయోజనం చేకూరనుందని ఆయన తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై సోషల్ ఆడిట్

కె.గంగవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం దృష్టి సారించిందని సమగ్ర శిక్షా జిల్లా సీఎంవో జీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం ఆయన కోటిపల్లి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. సామాజిక తనిఖీ విధానాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి మంజూరైన రూ.24,51,402 లను 30 మందికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం అందించారు. మండపేట కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే వేగుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

రావులపాలెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. గోవిందమాలధారులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి పెద్ద, చిన్న శేషవాహనోత్సవ సేవలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


కొత్తపేటలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని 29 మందికి మంజూరైన సీఎం సహాయ నిధి రూ.22,37,533ల చెక్కులను అందచేశారు..

నేడు జనసేన స్థూపం ఆవిష్కరణ

కె.గంగవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అముజూరు గ్రామంలో శనివారం జనసేన పార్టీ స్థూపం ఆవిష్కరణ ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, చక్రిలు తెలిపారు. గ్రామంలో ఉదయం జరిగే ఆవిష్కరణ సభకు జనసైనికులు తరలి రావాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర కలశాభిషేకం


ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. మహిళలు 108 కలశాలతో పవిత్ర జలాలను తీసుకువచ్చారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వేద పండితులు ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు స్వామివారికి బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై అలంకృతుడైన శ్రీవారు పురవీధులలో విహరించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణకర్తలు పాతపాటి వెంకట సత్యనారాయణరాజు, రాజ్యలక్ష్మి దంపతులు బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ వినయ్‌కుమార్‌రాజు వాటి ఏర్పాట్లు పర్యవేక్షించారు.


రామచంద్రపురంలో డాక్టర్ కవితను సన్మానిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలి

ఆలమూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): సమాజానికి వెలుగురేఖలు మహిళలే అని వెన్నెల సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నరసింహమూర్తి అన్నారు. మండలంలోని మూలస్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.తాతాజీ, జి.సీతారామశర్మ, కార్యదర్శి వీరమాత, యానిమేటర్స్ సువర్ణ, వనస, చంద్రకళ, అంగన్‌వాడీ విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌లో...

రాయవరం(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వెదురుపాక యూనియన్ బ్యాంక్ మేనేజర్ లొల్ల మహేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెదురుపాక యూనియన్ బ్యాంక్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్యాంక్‌లో మహిళా ఉద్యోగి, యానిమేటర్లతో కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా ఉద్యోగి బి.శ్రావణి, యానిమేటర్ల ఎం.శ్రీదేవి, వి.నాగమణి, సీహెచ్ ప్రసన్న, కె.కాంత కుమారి, జి.సత్యవేణిలను మేనేజర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఖాతాదారులు సత్కరించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు కె.నాగబాబు, తాడి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో 2కే రన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, విష్ణు కుమారి ఆధ్వర్యంలో చెల్లూరు గ్రామంలో 2కే రన్ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మాణిక్యం, శ్రీదేవి, సింహాచలం, మహిళలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులకు దీటుగా నిలుస్తున్నారు. వ్యాపార, వాణిజ్య, ఉద్యోగాల్లో దూసుకు పోతూ మహరాణుల్లా చలామణి అవుతున్నారు. సచివాలయ వ్యవస్థలో మహిళా పోలీసులుగా విధులు నిర్వహిస్తున్న వారంతా శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా కలుసుకుని సందడి చేశారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపో తున్నారని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు మహిళల భద్రత పోలీసుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కళాశాలలో పనిచేస్తున్న మహిళా అధ్యాపక బృందాన్ని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు, డాక్టర్ కె.అంకమరావు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకులను సత్కరిస్తున్న దృశ్యం

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు మహిళా దినోత్సవాన్ని జరిపారు. ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభకు డాక్టర్ కవిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థినుల సంప్రదాయ వస్త్రధారణ పోటీలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ కవితను ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు సన్మానించారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో

ద్రాక్షారామ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద కేంద్రాలను పంచాయతీలు ఆర్థికవనరులుగా మార్చుకోవాలని ఎంపీడీవో కె.పద్మజ్యోతి అన్నారు. శుక్రవారం రామచంద్రపురం మండలం వెల్లలో చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద మండలంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. క్లాప్ మిత్రుల ద్వారా తడిపొడి చెత్త వేరువేరుగా సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా రిసోర్సు పర్సన్ లావణ్య పలు అంశాలు వివరించారు. సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు ఈవోపీఆర్‌డీ షెలట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ మండపేటకు ప్రజలు సహకరించాలి

మండపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మండపేట మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు కోరారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి తడి,పొడి చెత్తపై వార్డు మహిళలకు అవగాహన కల్పించారు. తడిపొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీ చేసుకోవటం ద్వారా ఇంటి వద్దనే సాగు చేసుకునే ఉద్యాన పంటలకు ఎరువుగా వాడుకోవచ్చని ఆయన సూచించారు. పట్టణంలో ప్రజలు తమ ఆస్తిపన్నును మున్సిపాల్టీకి చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. పట్టణంలో రోడ్డుపై చెత్తవేసిన ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకుడికి కమిషనర్ రూ.1000 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడరన్‌లో 9న అవగాహన సదస్సు

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించేందుకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు తెలిపారు. 9న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

బహిరంగ ప్రకటన

[illegible]

షెడ్యూలు

3.G. District, Athreyapuram (M), athreyapuram SRO Utchili gram panchayat in rs no.16/3 for on extent of 0.05 cents with d.n.1-315 with rcc roof building is measured and bounded by
East : Land of namburi venkatramaraju 41ft
South: Land of Namburi Tataraju 54ft
West : Land of Matta Narasayya and 7ft Width Road
North : Building of gidugu dharmarao 54ft

[illegible]